

వినాయకనగర్ పార్కులో సేకరించిన వ్యర్థాలతో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో 'స్వచ్ఛత సేవ'

ఖైరతాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 ఆధ్వర్యంలో శనివారం వినాయకనగర్ పార్కులో శ్రమదానం చేశారు. ఉపకమిషనర్ ప్రశాంతి, వైద్యాధికారి డాక్టర్ భార్గవ్ నారాయణతో పాటు ఇతర అధికారులు సిబ్బంది పార్కులోని చెత్తను, వ్యర్థాలను సేకరించి వాహనాల్లో తరలించారు.



అనారోగ్యంతో బాధపడుతున్న జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన కోటని స్వామి కుటుంబ సభ్యులకు రూ. 2.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్
(బంజారాహిల్స్- ఆంధ్రజ్యోతి)

ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

- సిమెంట్, కాంక్రీట్లతో ఇళ్లు, షాపుల ముందు ఎత్తుగా నిర్మాణం
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు, పాదచారులు

బోరబండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆ ప్రాంతంలో గుడి, బడి వంటివి లేవు... అలాగే వాహనాల రాకపోకలవల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న దాఖలాలు కూడా లేవు. అయినప్పటికీ కొందరు తమ ఇళ్లు, షాపుల ముందు నుంచి వాహనాలు వెళ్ల కూడదనే ఉద్దేశంతో రోడ్లపై సిమెంట్, కాంక్రీట్‌లతో ఎత్తుకట్టలు (స్పీడ్ బ్రేకర్స్) నిర్మించి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. బోరబండ పరిధిలోని వినాయకరావునగర్, బంజార్‌నగర్, రహ్మత్‌నగర్ కార్మికనగర్, శ్రీరాంనగర్‌లలో కొంతమంది ఇంటి యజమానులు తమ ఇంటి ముందు స్పీడ్ బ్రేకర్లు నిర్మించారు. జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఈ స్పీడ్ బ్రేకర్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. వెంటనే వీటిని తొలగించాలని అధికారులును వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

అవసరం లేని చోట నిర్మాణం

రోడ్డు దాటుతున్నప్పుడు జరిగే ప్రమాదాలను నివారించడానికి బడి , గుడి ఉన్న ప్రదేశాల్లో స్థానికుల వినతి మేరకు, ట్రాఫిక్ పోలీసుల సూచనల మేరకు అవసరమైన ప్రదేశాల్లోను జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్లపై స్పీడ్ బేకర్లు నిర్మిస్తారు. అయితే, కొంతమంది అవసరం లేని చోట స్పీడ్ బ్రేకర్ పేరుతో ఎత్తు కట్టలు నిర్మించి వాహనదారులకు ఇబ్బందులు కల్గిస్తున్నారు. నిత్యం ప్రమాదాలు జరిగే ప్రదేశం అయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోయి ప్రభుత్వ నిధులతో వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేసుకోవాలి. అలా కాకుండా ఇంటి యజమానులే సిమెంట్‌తో ఎత్తు కట్టలు నిర్మించడం వలన వాహదారులు ఇబ్బందులు పడటంతో పాటు ఇంటి ముందు నిర్మించిన కట్టల వద్ద మురుగు నీరు, వర్షపు నీరు నిలిచిపోతున్నది. వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి ఇసుక కొట్టుకురావడంతో కొత్త సమస్య ఉత్పన్నమౌతున్నదని స్థానికులు చెప్తున్నారు.



గల్లీ రోడ్లలో ఇళ్ల ముందు సిమెంట్‌తో నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు

నీళ్లు నిలిచిపోతున్నాయి

కార్మిక నగర్ కూరగాయాల మార్కెట్ సమీపంలో రోడ్డుపై ఇళ్ల ముందు ఇష్టానుసారంగా ఇంటికో సిమెంట్ కట్టను నిర్మించుకున్నారు. ఈ కట్టలతో మంజీరా నీళ్లు వచ్చిన రోజు, ఇళ్లలో వాడిన నీళ్లు ఇంటి ముందు ఉన్న కట్ట వద్దకు వచ్చి నిలుస్తున్నాయి. ఈ నీళ్లతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగు తున్నాయి.

-ఎస్ సుదర్శన్, కార్మికనగర్



మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ప్రముఖులు

తెలంగాణలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి: మంత్రి జూపల్లి

బంజారాహిల్స్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బంజారాహిల్స్ హోటల్ తాజ్ డెక్కన్‌లో ఆసియా ప్రైమ్ మీడియా ఆధ్వర్యంలో గ్లోబల్ టూరిజం అవార్డుల ప్రదానోత్సవం శనివారం జరిగింది. అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రంగంలో విశేష, వినూత్న ఆవిష్కరణలతో కృషి చేసిన సంస్థలు, ప్రతినిధులకు మంత్రి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుం టున్నదని అన్నారు. అతిథ్య రంగంలో కూడా రాష్ట్ర విశేషంగా రాణిస్తోందన్నారు. అంతర్జాతీయంగా పర్యాటక దేశాలతో కలిసి పని చేసేందుకు ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దిటి మల్లయ్య, కార్యదర్శి శీలం రాజకుమార్ తదితరులు

గంగపుత్రుల సమస్యలపై మంత్రి పొంగులేటికి వినతి

ఎర్రగడ్డ, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): గంగపుత్రుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గంగపుత్ర సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దిటీ మల్లయ్య, కార్యదర్శి శీలం రాజకుమార్ గంగపుత్రల ఆధ్వర్యంలో శనివారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీ కులాల వర్గీకరణ అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలను జరపాలని వారు కోరారు. గంగపుత్ర వృత్తి సహకార సంఘాల పరిరక్షణ కోసం ఫిషరీస్ యాక్ట్‌ను తీసుకురావాలని కోరారు. మంత్రికి వినతి పత్రం అందించిన వారిలో తెలంగాణ గంగపుత్ర సంఘం నాయకులు కుమార్, గొల్ల సత్యం, పాక మధుసూదన్ ఉన్నారు.

'కళింగ'లో సిండ్రెల్లా డిజైనర్ వస్త్ర ప్రదర్శన ప్రారంభం

బంజారాహిల్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని ప్రముఖ సినీ నిర్మా త బెల్లంకొండ సురేష్ సతీమణి పద్మావతి బెల్లంకొండ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన సిండ్రెల్లా డిజైనర్ వస్త్ర ప్రదర్శ నను శనివారం ఆమె బెల్లంకొండ సురేశ్ సోదరి నాగలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ, సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్ర ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలే దన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరి స్తున్నారని, ఇక్కడి ప్రదర్శనలో కొలువుదీరిన విభిన్న రకాల ఉత్పత్తులు ఎంతో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. నిర్వాహకురాలు జ్యోతి చలసాని మాట్లాడుతూ, ప్రదర్శనలో చేనేతకారులు సిల్క్ అండ్ హ్యాండ్ లూమ్, భాగల్‌పూర్, పటోలా, గద్వాల్‌తో పాటు ఫ్యాన్సీ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, డిజైనర్ దుస్తులు, జ్యువెలరీ, హోమ్ డెకార్ వంటి 50 వేల రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని తెలిపారు. ఈనెల 23వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు



ప్రదర్శనలో వస్త్ర ఉత్పత్తులను పరిశీలిస్తున్న పద్మావతి బెల్లంకొండ

వీసీల నియామకాల్లో మాలలకు తీవ్ర అన్యాయం

- డా. మంచాల లింగస్వామి

తార్నాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ యూనివర్సిటీలకు ప్రకటించిన వైస్‌చాన్సర్ల(వీసీ)ల నియామకాల్లో మాల సామాజికవర్గానికి తీవ్ర అన్యాయం చేశారని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. మంచాల లింగస్వామి అన్నారు. శనివారం ఓయూలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను ప్రకటిస్తే ఒక్క మాల సామాజికవర్గానికి చెందిన ప్రొఫెసర్ కూడా లేడన్నారు. మాల సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించడం విడ్డూరంగా ఉందని మండి పడ్డారు. కార్యక్రమంలో అంసా రాష్ట్ర కార్యదర్శి నీరడి సూర్యం, నామ సైదులు, దుగ్గి సురేష్, గాజుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు మూడు రోజుల టెక్నికల్ సెమినార్లు

- తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రమాదాల నివారణలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల బాధ్యత ముఖ్యమైందని తెలంగాణ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యాదగిరి అన్నారు. ప్రైవేట్ సెక్టార్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్ల కోసం పోలీక్యాబ్ కంపెనీ నగరంలో మూడురోజుల పాటు టెక్నికల్ సెమినార్లు నిర్వహించనుందని శనివారం ఖైతరాబాద్ మింట్ కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. 21,22 తేదీల్లో మదీనాగూడ రావిలా గ్రాండ్ హాల్‌లో, 23వ తేదీన నాగోల్ వైట్ పెర్ల్ బాంకెట్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు టెక్నికల్ సెమినార్లు నిర్వహిస్తారని తెలిపారు. సెమినార్‌లో విద్యుత్ రంగనిపుణులు విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు, సాఫ్ట్‌వేర్, ఇండస్ట్రియల్ రంగాల్లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లు ఈ సెమినార్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఖైరతాబాద్‌లోని 'డబుల్' ఇళ్లకు సోలార్ విద్యుత్ సౌకర్యం

- కేంద్ర గృహ నిర్మాణ శాఖ సంయుక్త కార్యదర్శి హామీ

ఖైరతాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఇందిరానగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను శనివారం కేంద్ర గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి కుల్‌దీప్ సింగ్ పరిశీలించారు. రాష్ట్ర హౌసింగ్ విభాగం ఎండీ వీపీ గోవర్ధన్, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్ నాయుడు తదితరులతో కలిసి అన్ని బ్లాకుల్లో ఆయన కలియ తిరిగారు. ఒక లబ్ధిదారు ఇంట్లోకి వెళ్లి వారి స్థితిగతులను, ఇంట్లోని వసతులను కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను, ఇళ్ల రాకముందు, ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కామన్ మెయింటెనెన్స్ విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని లబ్ధిదారులు చెప్పడంతో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని, అందరూ ఐక్యంగా ఉంటూ ఎక్కువ కాలం మన్నిక ఉండేలా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ సీఈ అనిల్‌రాజ్, ఎస్‌ఈ వెంకట్‌దాస్‌రెడ్డి, ఈఈ నర్సింగ్‌రావు, డీఈ సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూమ్ ఇంటిలోకి వెళ్లి లబ్ధిదారు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కేంద్ర గృహ నిర్మాణ శాఖ సంయుక్త కార్యదర్శి కుల్‌దీప్ సింగ్ తదితరులు



డాన్ బాస్కో స్కూల్లో జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కష్టపడి చదివితేనే భవిష్యత్ బాగుంటుంది

ఎర్రగడ్డ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇప్పుడు కష్టపడి చదివితేనే భవిష్యత్ బాగుంటుందని, ఉన్నత స్థాయికి చేరతారని సెయింట్ జోసెఫ్ కళాశాల ఫౌండర్ ప్రిన్సిపల్ ఫాదర్ వీకే స్వామి అన్నారు. ఎర్రగడ్డలోని డాన్ బాస్కో స్కూల్లోని డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. డీబీడీసీ రెక్టర్ ఫాదర్ గోపి పీటర్ మాట్లాడుతూ, 2021-2024 అకడ మిక్ ఇయర్‌లో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ అక్వినాస్, కామర్స్ హెచ్ ఓడీ బాలరాజు, కంప్యూటర్ హెచ్‌ఓడీ రవి, అలైడ్ సైన్స్ హెచ్‌ఓడీ కృష్ణ జోషి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కరాటేలో నిఖిల్ సాయికి స్వర్ణం



హైదరాబాద్: రాష్ట్ర కరాటే సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఏ కరాటే చాంపియన్‌షిప్‌లో నిఖిల్ సాయి స్వర్ణ పతకం సాధించాడు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన బాలుర అండర్-15లో 55 కిలోల విభాగం కుమిటి కేటగిరిలో నిఖిల్ విజేతగా నిలిచాడు. నిఖిల్ నిజాంపేటలోని ప్రగతి సెంట్రల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు.

రేపు ఇందిరాపార్కు వద్ద ఎంజీఎస్సీ 57 కులాల దీక్ష

అడ్డగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ఇందిరాపార్కు వద్ద మాంగో గరోడి ఎస్సీ సంక్షేమ సంఘం(ఎంజీఎస్సీ) 57 కులాల ఆధ్వర్యంలో నిరసన, దీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను తుకారం గేట్ మరాఠాబస్తీలో ఎంజీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపదే సనాదన్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సనాదన్ మాట్లాడుతూ మంగో గరోడిలోని 57 కులాలకు చెందిన ప్రతి ఒక్కరూ నిరసన దీక్షలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంస్థ ముఖ్యనాయకులు అరుణ్‌లాల్, నాడే జిట్లాల్ గణేష్, రత్తిలాల్, కమ్లే, విజయ, మహేష్, మోతీలాల్, కిషన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎంఏ డ్రగ్స్ పట్టివేత: ముగ్గురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): డ్రగ్స్‌కు బానిసగా మారారు... కొనుగోలు చేయడానికి అవసరమైన డబ్బు లేక పోవడంతో చివరకు అదే డ్రగ్స్‌ను విక్రయించి డబ్బుతో పాటు.. డ్రగ్స్ తీసుకోవచ్చని పథకం వేశారు. చివరకు డ్రగ్స్ అమ్ముతూ.. శనివారం ఎక్సైజ్ పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. పట్టుబడిన నిందితుల్లో సుధాకర్‌రెడ్డి, నితిన్, ప్రకాష్ ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా పీలేరులో ఉండే సుదర్శన్‌రెడ్డి వద్ద నుంచి నితిన్, ప్రకాష్ డ్రగ్స్ తెచ్చి హైదరాబాద్‌లో గ్రాముకు రూ.5 వేల నుంచి రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. శనివారం అమీర్‌పేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బంజారాహిల్స్ రోడ్ నంబరు 7లో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై డ్రగ్స్‌తో వెళ్తున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో ఎస్‌టీఎఫ్ టీమ్ సీఐ మహేష్, ఎస్సై వరదా భూపాల్ తమ సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద 22.33 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ రూ. 2.15 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. డగ్స్‌ను, నిందితులను పట్టుకున్న సిబ్బందిని అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, ఏఈఎస్ స్మిత సౌజన్యలు అభినందించారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

అమీర్‌పేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఆర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యూసుఫ్‌గూడ శ్రీనగర్‌కాలనీ సమీపంలోని శాలివాహనగర్‌కు చెందిన కోనేర్ అరుణ్‌కుమార్(43) ఈనెల 16న రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఎర్రగడ్డ పిల్లర్ నంబర్ 972 వద్ద అరుణ్‌కుమార్ యూ టర్న్ తీసుకుండగా, సనత్‌నగర్ నుంచి అమీర్‌పేట వైపునకు వస్తున్న అపోలో మెడిసన్‌లో డెలివరి బాయిగా పనిచేస్తున్న త్రినాథ్ పలమణి ఢీకొట్టాడు. కింద పడిన అరుణ్‌కుమార్ తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు అరుణ్‌కుమార్ సెల్‌ఫోన్ నుంచి అతడి కుమారుడు మనోహర ప్రసాద్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కుమారుడు అక్కడి వచ్చి తండ్రిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుమారుడు మనోహర ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వీధి దీపాలకు మరమ్మతులు చేయండి

బంజారాహిల్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని కోరుతూ ఎంఐఎం నాయకులు ఎర్ర నగేష్, నాగరాజు జీహెచ్‌ఎంసీ వీధి దీపాల అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్లారెడ్డిగూడ, అంబేడ్కర్‌నగర్, సంజయ్ గాంధీ నగర్‌ల్లో వీధి దీపాలు వెలుగక పోవడంతో స్థానికులు రాత్రిపూట రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తే సిబ్బంది అసలు పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. వెంటనే అధికారులు స్ట్రీట్ లైట్స్‌కు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు.



జీహెచ్‌ఎంసీ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఎంఐఎం నాయకులు ఎర్ర నగేష్, నాగరాజు

సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్ సాధనకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్

బర్కత్‌పుర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్ సాధనకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతున్నట్లు దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ తెలిపారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్ ఏర్పాటు చేయాలని, పార్లమెంట్ స్టాండింగ్ కౌన్సిల్, లా కమిషన్‌లు గతంలో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాయని అన్నారు. హైదరాబాద్ అన్ని విధాలుగా అనుకూలమని ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు, గోవా, మహారాష్ట్రలకు అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలో జేఏసీ తరపున ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి, ప్రధాని, న్యాయ శాఖ మంత్రి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లను కలిసి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. సదస్సులో సుప్రీంకోర్టు న్యాయవాది ఉపాధ్యాయ, హైకోర్టు న్యాయవాదులు చల్లా రాంచంద్రారెడ్డి, రాంకిషోర్, మూర్తి పాల్గొన్నారు.

యూట్యూబ్ చానళ్ల వారి నుంచి రక్షించండి

- పోలీసులకు అదృష్ట జ్యువెల్లర్స్ నిర్వాహకుడి విజ్ఞప్తి

పంజాగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): "నా సంస్థ గురించి చెడు ప్రచారం చేస్తామని యూట్యూబ్ చానళ్ల నిర్వాహకులు బెదిరించడంతో మొదట రూ. 1.50 లక్షలు ఇచ్చా. మళ్లీ రూ. 60 లక్షల ఇవ్వాలని వేధిస్తుండటంతో గత్యంతరం లేక కుషాయిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశా" అని కాప్రా శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన అదృష్ట జ్యువెల్లర్స్ నిర్వాహకుడు గుడివాడ రమణ లాల్ వాపోయాడు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా తాను శ్రీనివాసనగర్‌లో అదృష్ట జ్యువెలర్స్ షాపును నిర్వహిస్తున్నానని తెలిపాడు. తన వద్ద రత్నాలు, వజ్రాలు కొనుగోలు చేసిన వారు వాటిని ధరించడం వల్ల మంచి ఫలితాలు పొందుతున్నారని అన్నాడు. గత ఆగస్టులో భారతవర్ష యూ ట్యూబ్ చానల్‌కు చెందిన డి.శివప్రసాద్, హిందూ జనశక్తి చానల్‌కు చెందిన లలితకుమార్, ఏది నిజం చానల్‌కు చెందిన హరికృష్ణ మరికొంత మందితో తన దుకాణానికి వచ్చి డబ్బులు డిమాండ్ చేశారన్నారు. తాను మొదట ఇవ్వకపోవడంతో తన దుకాణం గురించి యూ ట్యూబ్‌లో తప్పుడు ప్రచారం చేస్తూ వీడియోలు పెట్టారని, వాటిని తొలగించేందుకు డబ్బులు డిమాండ్ చేయడంతో గత నెల 6న 1.50 లక్షలు ఇచ్చానని అన్నారు. మళ్లీ వేరే ఫోన్ నంబర్ల నుంచి ఫోన్లు చేసి బెదిరిస్తూ రూ. 60 లక్షలు డిమాండ్ చేశారని, డబ్బు ఇవ్వకపోతే నా దుకాణం గురించి యూ ట్యూబ్ చానల్, సామాజిక మాధ్యమాల్లో చేడుగా ప్రచారం చేస్తామని, చంపుతామని బెదిరిస్తుండటంతో ఈ నెల 11న కుషాయిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. సదరు యూ ట్యూబ్ చానళ్ల నిర్వాహకుల నుంచి తనకు రక్షణ కల్పించాలని, న్యాయం చేయాలని ఆయన పోలీసులకు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమణ లాల్



అవగాహన కార్యక్రమంలో మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్


బైసన్ డివిజన్ సైనిక దళాలకు రోడ్డు భద్రతపై అవగాహన

అల్వాల్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): గోల్కొండలోని బైసన్ డివిజన్‌కు చెందిన సైనిక దళాలకు వ్యక్తిగత వాహనాల ప్రమాదాల నివారణకు తెలంగాణ రాష్ట్ర పోలీసు సిబ్బందితో కలిసి రెండు రోజులుగా నిర్వహిస్తున్న రహదారుల భద్రత-అవగాహన కార్యక్రమం శనివారం ముగిసింది. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, డ్రైవింగ్‌లో మెళకువలు తదితర అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బైసన్ డివిజన్ కమాండింగ్ ఆఫీసర్, మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్ మాట్లాడుతూ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాల్లో మెరుగైన డ్రైవింగ్‌తో పాటు రోడ్డు భద్రతా ప్రమాణాలను రూపొందించిందన్నారు.

రాచకొండ పోలీసుల కనుసన్నల్లోనే కబ్జాలు

- రేవంత్ రెడ్డి బినామీలకు ఆ భూముల అప్పగింత: బక్క జడ్సన్

పంజాగుట్ట, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన ఓ కార్పొరేషన్ ఛైర్మన్ మల్కాజిగిరి పరిధిలోని తిరుమల్ నగర్ కాలనీవాసులను పోలీసుల అండతో బెదిరించి, వారిని ఖాళీ చేయించి భూమిని కబ్జా చేస్తున్నాడని బక్క జడ్సన్ ఆరోపించారు. రాచకొండ పోలీసు కనుసన్నల్లో కబ్జాలు జరుగు తున్నాయని, వాటిని రేవంత్ రెడ్డి బినామీలకు అప్పగిస్తున్నారని అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో తాను చెప్పినట్టే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ముసుగులో భూదందాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం మల్కాజిగిరి పరిధిలోని తిరుమల్‌నగర్‌లో 300 ఎకరాలు తమదేనంటూ యాసఫ్ బేగం కుమారులు పోలీసుల సహాయంతో స్థలం చుట్టూ రేకుల ఫెన్సింగ్ పెట్టారన్నారు. తిరుమల్‌నగర్, పొరుగున ఉన్న పది కాలనీలు కలిసి మూడు వందలకు పైగా ఇళ్లు ఉన్నాయన్నారు. అయితే, ఆ భూమి తమదేనంటూ యాసుఫ్ బేగం సంబంధీకులు పోలీసులతో వచ్చి ఖాళీగా ఉన్న స్థలాల చుట్టూ రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని, ఇళ్లు కట్టుకున్న వారిని బెదిరిస్తున్నారని బక్క జడ్సన్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ జి. సూర్యనారాయణ రెడ్డికి సర్వే నంబర్ 398,399, 409,410,411/1,411/2,579లలో సుమారు 19.18 ఎకరాల భూమి ఉందని, అందులో ఆయన వ్యవసాయ ఉత్పత్తులు, పశువుల కొట్టం, సహాయకుడికి క్వార్టర్ కోసం షెడ్ నిర్మించారని తెలిపారు. 1984 నుంచి ప్రభుత్వానికి ఆయన అన్ని రకాల పన్నులను చెల్లిస్తున్నారని చెప్పారు. ఈ భూమిపై రేవంత్ రెడ్డి సన్నిహితుడు, ఓ కార్పొరేషన్ చైర్మన్ ఫయీమ్ ఖురేషి కన్ను పడిందని, ఆయనకు స్థానిక పోలీసులు సహకరించడంతో ఆ భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బక్క జడ్సన్

మందులు తీసుకొని బిల్లు ఎగ్గొట్టిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): మందులు తీసుకొని బిల్లు కట్టకుండా ఎగ్గొట్టిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్‌పేటలోని అపోలో ఫార్మసీలో పల్లె రమేష్ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 18న ఓ వ్యక్తి ఫోన్ చేసి రూ.21,896 విలువ చేసే మందులను ఆర్డర్ చేసి తన చిరునామాకు డెలివరీ చేయా లని కోరాడు. దీంతో రమేష్ మందులను ప్యాక్ చేసుకొని ఫోన్ చేసిన వ్యక్తి చిరునామాకు చేరుకున్నాడు. సదరు వ్యక్తి మందులు తీసు కొని డబ్బు తీసుకువస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్పందించలేదు. మోస పోయినట్టు గ్రహించిన రమేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీసీల నియామకాల్లో మాలలకు తీవ్ర అన్యాయం

● అంసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. మంచాల లింగస్వామి

తార్నాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివిధ యూనివర్సిటీలకు ప్రకటించిన వైస్‌చాన్సలర్ల(వీసీ)ల నియామకాల్లో మాల సామాజికవర్గానికి తీవ్ర అన్యాయం చేశారని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. మంచాల లింగస్వామి అన్నారు. శనివారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను ప్రకటిస్తే ఒక్క మాల సామాజికవర్గానికి చెందిన ప్రొఫెసర్ కూడా లేడన్నారు. మాల సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో విద్యావంతులుగా, మేధావులుగా తమ రచనలతో, ప్రసంగాలతో ఉద్యమానికి ఊపిరి పోసిన మాల ప్రొఫెసర్లను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం సిగ్గుచేటని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో అంసా రాష్ట్ర కార్యదర్శి నీరడి సూర్యం, నామ సైదులు, దుగ్గి సురేష్, గాజుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శోభ తదితరులు

అడ్డగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శోభ కోరారు. ఈ మేరకు శనివారం మహిళా సంఘాలతో కలిసి మారేడుపల్లిలోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లోని శాస్త్రిపురం, ఆర్‌ఆర్‌సీ మైదాన్, లోహియానగర్, వెంకట్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపై మురుగు పారుతుందని జీఎంకు వివరించారు. దుర్వాసన వెలువడుతూ ఇళ్లల్లోని ఉండలేని పరిస్థితి నెలకొన్నదని అన్నారు. రాకపోకలకు స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.



కార్యక్రమంలో పాల్గొన్న సైకాలజిస్టులు

సైకాలజిస్టుల సమస్యలను
ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా: పద్మశ్రీ హన్మంతరావు

రాంగోపాల్‌పేట్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): సైకాలజిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని స్వీకార్ ఫౌండేషన్ ఛైర్మన్, పద్మశ్రీ హన్మంతరావు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శనివారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయిన ఆయన మాట్లాడుతూ....శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే మానసికంగా ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్యనిపుణులు ప్రీతి స్వరూప్, హరిణి అట్లూరు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కథల పోటీలలో
నటుడు, రచయిత 'ఆకెళ్ల'కు తృతీయ బహుమతి



ఆకెళ్ల సూర్యనారాయణమూర్తి

చిలకలగూడ, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించిన కథల పోటీలలో నటుడు, రచయిత ఆకెళ్ల సత్యనారాయణ మూర్తికి తృతీయ బహుమతి లభించింది. బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్, విశాఖ సంస్కృతి మాస పత్రిక ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్నంలో 8వ జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించారు. ఛాయాచిత్రం కథకు ఆకెళ్ల సత్యనారాయణమూర్తి తృతీయ బహుమతి అందుకొన్నాడు. దక్షిణ మధ్యరైల్వే సికింద్రాబాద్ డివిజన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఆకెళ్ల సత్యనారాయణ మూర్తి స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. ఇప్పటి వరకు దాదాపు 30కథలు, గేయాలు, గీతాలు రచించి బహుమతులు అందుకున్నాడు. ఆయన రచించిన కవితలు, గేయాలు. నాటికలు ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ప్రసారమయ్యాయి.

బైసన్ డివిజన్ సైనిక దళాలకు రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్

అల్వాల్, అక్టోబర్ 19 (ఆంధ్ర జ్యోతి): గోల్కొండలోని బైసన్ డివిజన్‌కు చెందిన సైనిక దళాలకు వ్యక్తిగత వాహనాల ప్రమాదాల నివారణకు తెలంగాణ రాష్ట్ర పోలీసు సిబ్బందితో కలిసి రెండు రోజులుగా నిర్వహిస్తున్న రహదారుల భద్రత-అవగాహన కార్యక్రమం శనివారం ముగిసింది. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, డ్రైవింగ్‌లో మెళుకవలు తదితర అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బైసన్ డివిజన్ కమాండింగ్ ఆఫీసర్, మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాల్లో మెరుగైన డ్రైవింగ్‌తో పాటు రోడ్డు భద్రతా ప్రమాణాలను రూపొందించిందన్నారు.అనంతరం ప్రమాదాలను నివారించడానికి అన్ని వాహనాల్లో రీట్రోఫిట్ చేయగల కొత్త తరం సాంకేతిక ఇంప్లాంట్‌లను ప్రదర్శించే స్టాటిక్ డిస్‌ప్లేను ప్రదర్శించారు.



సికింద్రాబాద్ కమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయం వద్ద శనివారం జరిగిన ధర్నాలో శ్రీనివాస్‌నగర్ సవరాలబస్తీకి చెందిన బీఆర్‌ఎస్ యువనాయకుడు పోగర్తి భువనరావు తదితరులు పాల్గొన్నారు. (బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి)

తెలంగాణ ప్రభుత్వ విద్యా కమిషన్ సలహాదారుడిగా నియమితులైన వెంకట్‌రెడ్డిని శనివారం సికింద్రాబాద్‌లో తెలంగాణ తల్లుల సంఘం ప్రతినిధులు భాగ్యలక్ష్మి, జమున, శోభ, రామలీల, లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. (అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)





జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వెంకట్‌సాయి ఇటీవల ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శనివారం తార్నాకలోని క్యాంపు కార్యాలయంలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట డీసీ సువర్ణ, ఏఈ వేణు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులున్నారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి

చెత్తశుద్ధి ఏదీ.?

● చెత్త నిర్వహణ అస్తవ్యస్తం
● వారాసిగూడలో రోడ్లపై పేరుకుపోయిన వ్యర్థాలు
● రూ. 5ల భోజన కేంద్రం వద్ద కంపు



వారాసిగూడలో రూ.5ల భోజనం కేంద్రం వద్ద పేరుకుపోయిన చెత్త

బౌద్ధనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని చెత్త రహితంగా మార్చడానికి జీహెచ్‌ఎంసీ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది. రోజు వారీగా చెత్తను తొలగించే పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. వారు సక్రమంగా చెత్తను తొలగించకపోవడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. చెత్త నిర్వహణలో అధికారులకు చిత్తలేదు అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ సర్కిల్ బౌద్ధనగర్ డివిజన్‌లో చెత్తనిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపట్టి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు ఆదేశిస్తున్నా, రాంకీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దాంతో పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల వరకు చెత్తను తొలగించకపోవటంతో ఆ ప్రాంతాల్లో దుర్వాసనతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. వారాసిగూడ ప్రధానరహదారి పక్కన ఏర్పాటు చేసిన రూ.5ల భోజన కేంద్రం వద్ద కుప్పకుప్పలుగా చెత్త పేరుకుపోయింది. దాంతో అక్కడికి భోజనం చేయడానికి వచ్చిన వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాంకీ సంస్థకు నోటీసులు ఇచ్చాం

నగరంలో చెత్త సేకరించే నిర్వహణను జీహెచ్‌ఎంసీ.. రాంకీ సంస్థకు అప్పగించింది. కొద్ది రోజులుగా రాంకీ సంస్థ సిబ్బంది చెత్తను సేకరించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. పలు ప్రాంతాల్లో చెత్తను తొలగించకపోవడంతో రాంకీ సంస్థకు నోటీసులు కూడా ఇచ్చామని జీహెచ్‌ఎంసీ అధికారి ఒకరు తెలిపారు.

దుర్వాసనతో భోజనం ఎలా చేస్తారు: బీజేపీ

బీజేపీ మహాకాళీ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి మద్దెర్ల శ్యాంసుందర్ స్థానికులతో వారాసిగూడలో పర్యటించారు. రూ. 5ల భోజనం కేంద్ర వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ చెత్తకుప్పల మధ్య దుర్వాసనతో పేద ప్రజలు భోజనం ఎలా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చెత్తకుప్పలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

నేడు వారాసిగూడలో
ఉచిత వైద్యశిబిరం

బౌద్ధనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహాకాళీ సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి మద్దెర్ల శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ఈ నెల 20న వారాసిగూడలోని బ్యాంక్ ఆఫ్ బరోడ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. అన్ని విభాగాల వైద్యులు పాల్గొని బీపీ, షుగర్, చెస్ట్, డయాగ్నొస్టిక్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నారు. వైద్య శిబిరాన్ని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారని మద్దెర్ల శ్యాంసుందర్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరానికి వచ్చి ప్రజలు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపదే సనాదన్ తదితరులు

రేపు ఇందిరాపార్కు వద్ద
ఎంజీఎస్సీ 57 కులాల దీక్ష

అడ్డగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ఇందిరాపార్కు వద్ద మాంగో గరోడి ఎస్సీ సంక్షేమ సంఘం(ఎంజీఎస్సీ) 57 కులాల ఆధ్వర్యంలో నిరసన, దీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను తుకారం గేట్ మరాఠాబస్తీలో ఎంజీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉపదే సనాదన్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సనాదన్ మాట్లాడుతూ మంగో గరోడిలోని 57 కులాలకు చెందిన ప్రతి ఒక్కరూ నిరసన దీక్షలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంస్థ ముఖ్యనాయకులు అరుణ్‌లాల్, నాడే జిట్లాల్ గణేష్, రత్తిలాల్, కమ్లే, విజయ, మహేష్, మోతీలాల్, కిషన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి: చంద్రశేఖర్



నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న హెచ్‌ఎం స్వరూప

పద్మారావునగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. పాఠశాలల అభివృద్ధికి సమాజ సేవకులు, జర్నలిస్టులతో కలిసి కమిటీగా ఏర్పాడ్డామని ఆయన తెలిపారు. ఉన్నత పాఠశాల కోసం, ఈ కమిటీ పోరాటం చేసి నూతన భవన నిర్మాణానికి నిధులు చేయించామని అన్నారు. దాతల సహాయంతో పాఠశాలకు, విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్, పుస్తకాలను, బ్యాగులను సమకూర్చినట్టు ఆయన పేర్కొన్నారు. బోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు స్వరూపం ఆధ్వర్యంలో పేరెంట్స్ టీచర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని అన్నారు. 2024 డీఎస్సీ ద్వారా ఎంపికయిన నూతన ఉద్యోగులు విధులలో చేరగా, ప్రధానోపాధ్యాయురాలు స్వరూప వారికి స్వాగం పలికారు. అనంతరం వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. సమావేశంలో పాఠశాల పూర్వ హెచ్‌ఎం మల్లికార్జున్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, ఉపాధ్యక్షుడు ఆర్. రాజు, కోశాధికారి వీజే.శేషగిరిరావు, కార్యదర్శి గోపీకృష్ణ, భరత్‌భూషన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక పిల్లలను బాధ్యతగా చూడాలి



మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ పిల్లలతో అమ్మానాన్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మారేడుపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక పిల్లలను బాధ్యతగా చూడాలని అమ్మానాన్న వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు తులాల శ్రీలత చెప్పారు. వారికి తోడుగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆమె అన్నారు. శనివారం కార్ఖానాలోని పేమెన్ కాప్ పేరెంట్స్ అసోసియేషన్ సెంటర్‌లో సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పిల్లల (మెంటల్లీ హ్యాండీక్యాప్డ్)తో కలిసి అమ్మానాన్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భోజనం చేశారు. ప్రత్యేక పిల్లల బాగోగులు చూసుకునేందుకు పేరెంట్స్ అసోసియేషన్ ఏర్పడి సదుపాయాల కల్పించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో దాత బి.బాల నరసింహ, వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి సుబ్రహ్మణ్యం, పేరెంట్స్ అసోసియేషన్ నిర్వాహకులు రమేష్ చంద్ర పాల్గొన్నారు.

రాచకొండ పోలీసు కనుసన్నల్లోనే కబ్జాలు

● ఆ స్థలాలు రేవంత్‌రెడ్డి బినామీలకు అప్పగింత ● అక్రమాలకు పాల్పడుతున్న సీఎం సన్నిహితుడు
● కాంగ్రెస్ మాజీ నాయకుడు బక్క జడ్సన్



మాట్లాడుతున్న బక్క జడ్సన్

పంజాగుట్ట,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి సన్నితుడైన ఓ వ్యక్తి పోలీసుల అండదండలతో మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధి, తిరుమలనగర్ కాలనీ వాసులను బెదరించి స్థలాలను కబ్జా చేసి, డబ్బులు వసూలు చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. ఈ అక్రమాలు అన్నీ రాచకొండ పోలీసు కనుసన్నల్లోనే జరుగుతున్నాయని, ఆ స్థలాలను రేవంత్‌రెడ్డి బినామీలకు అప్పగిస్తున్నారని ఆయన తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తాను గతంలో చెప్పిన విధంగానే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ముసుగులో భూదందాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం మల్కాజిగిరి పరిధిలోని తిరుమలనగర్‌లో 300 ఎకరాలు మాదేనంటూ యూసఫ్ బేగం కుమారులు పోలీసుల సహాయంతో దగ్గర ఉండి స్థలం చుట్టూ రేకుల ఫెన్సింగ్ పెట్టించారని అన్నారు. తిరుమలనగర్, సమీపంలోని పది కాలనీలలో 300 వందలకుపైగా ఇళ్లు ఉన్నాయని అన్నారు. ఆ భూమి కూడా తమదేనంటూ యూసుఫ్ బేగంకు సంబంధించిన వ్యక్తులు, పోలీసులతో వచ్చి ఖాళీగా ఉన్న స్థలాల చుట్టూ రేకులు వేశారని, ఇళ్లు కట్టుకున్న వారిని బెదిరిస్తున్నారని అన్నారు.

మల్కాజిగిరి మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ జి.సూర్యనారాయణరెడ్డికి సర్వేనంబర్ 398, 399, 409, 410, 411/1, 411/2, 579లలో దాదాపు 19.18 ఎకరాల భూమి ఉందని అన్నారు. ఆయన వ్యవసాయ ఉత్పత్తులు, పశువుల కొట్టం, సహాయకుడు ఉండడానికి షెడ్‌లను నిర్మించారని అన్నారు. 1984 నుంచి ప్రభుత్వానికి అన్నిరకాల పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ భూమిపై రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు, ఓ కార్పొరేషన్ ఛైర్మన్ ఫయీమ్ ఖురేషి కన్నుపడిందని, ఆయనకు స్థానిక పోలీసులు సహకరించడంతో కబ్జా చేశాడని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

9.4 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకునేలా చర్యలు

● పెట్రోలింగ్, విజబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం : సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): ఏదైనా ప్రమాదం ఎదురైనా, ఆపదలో ఉన్నా వెంటనే డయల్ 100కు ఫోన్ చేస్తే బాధితులు ఎక్కడ ఉన్నా 9.4 నిమిషాల్లో పోలీసులు ఘటనాస్థలికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందించామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఇందులో భాగంగా పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ సిబ్బంది సంఖ్యను పెంచామన్నారు. గతంలో డయల్ 100కు ఫోన్ చేసిన వారిని చేరుకునేందుకు సుమారు 20 నిమిషాల వరకు పట్టేదని, ఇప్పుడు పోలీస్ రెస్పాన్స్ సమయాన్ని సగానికంటే తక్కువగా చేసేలా కార్యచరణ రూపొందించామన్నారు. విజబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇందులో భాగంగా కొత్తగా పెట్రోకార్, బ్లూకోల్ట్స్ సిబ్బంది సంఖ్యను పెంచామని చెప్పారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో విజబుల్ పోలీసింగ్‌ను పెంచడంలో భాగంగా పోలీసులు సైకిళ్లపై కూడా గస్తీ నిర్వహిస్తారని తెలిపారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ పెంచడం ద్వారా బందోబస్తు, నిఘాతోపాటు విజబుల్ పోలీసింగ్ పెరుగుతుందన్నారు. మహిళలకు సహాయకారిగా ఉండేందుకు పెట్రోలింగ్ బృందాల్లో మహిళా పోలీసులు కూడా ఉంటారని తెలిపారు.

విద్యుత్ అధికారుల మధ్య ఘర్షణ.. ఒకరికి గాయాలు

తిరుమలగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్‌లోని విద్యుత్ కార్యాలయంలో ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. బూరుగు ప్రసాద్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా కాగితాల రామ్ లైన్‌మన్‌గా విదులు నిర్వర్తిస్తున్నారు. శనివారం ఇద్దరి మధ్య డ్యూటీ విషయమై వాగ్వాదం జరిగింది. దాంతో ఆగ్రహం చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్ బూరుగు ప్రసాద్ రాడ్‌తో లైన్‌మన్ రామ్ తలపై కొట్టగా తీవ్రగాయాలయ్యాయి. సహోద్యోగులు వెంటనే గాయాలపాలైన రామ్‌ను ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన రామ్ తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్ బూరుగు ప్రసాద్‌పై ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఉద్యోగుల ద్వారా సమాచారం సేకరించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు పర్యవేక్షణలో ఎస్సై రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..
చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అమీర్‌పేట, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఆర్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యూసుఫ్‌గూడ శ్రీనగర్‌కాలనీ సమీపంలోని శాలివాహనగర్‌కు చెందిన కోసేర్ అరుణ్‌కుమార్(43) ఈనెల 16న రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఎర్రగడ్డ పిల్లర్ నంబర్ 972 వద్ద అరుణ్‌కుమార్ యూ టర్న్ తీసుకుండగా, సనత్‌నగర్ నుంచి అమీర్‌పేట వైపునకు వస్తున్న అపోలో మెడిషన్‌లో డెలీవరి బాయిగా పనిచేస్తున్న త్రినాథ్ పలమణి ఢీకొట్టాడు. కిందపడిన అరుణ్‌కుమార్ తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు అరుణ్‌కుమార్ సెల్‌ఫోన్ నుంచి అతడి కుమారుడు మనోహర ప్రసాద్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కుమారుడు అక్కడి వచ్చి తండ్రిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుమారుడు మనోహర ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.